ప్రజాశక్తి
శనివారం 31 డిసెంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు



చిరు ధాన్యాల పంపిణీకి చర్యలు

- జెసి శివ శ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు: ప్రజలకు పౌష్టిక ఆహారం అందించటంలో భాగంగా పోషక విలువలు ఉన్న చిరు ధాన్యాలైన రాగులు, జొన్నలు పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. చిరు ధాన్యాలు తినడంతో అధిక రక్త పోటు, మధుమేహం, ఇతర వ్యాధులు నిర్మూలించవచ్చన్నారు. జొన్నలు, రాగులు, సజ్జలు ,కొర్రలు వంటి అధిక ఫైబరు ఆహార ధాన్యాలకు ఇటీవలే ప్రాధాన్యత పెరిగిందని, దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం సాధారణంగా పంపిణీ చేస్తున్న వరి బియ్యం బదులుగా చిరు ధాన్యాలు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటుందని జేసి వివరించారు. తహసిల్దార్లు రేషన్ షాపుల నుండి వాలంటీర్ల ద్వారా వివిధ క్యాటగిరీలకు చెందిన పది మంది కార్డు దారులనుండి అభిప్రాయలు సేకరించి పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా..

చలో ఎర్రవరం విజయవంతం

▸▸భారీగా తరలివచ్చిన గిరిజనులు, ర్యాలీ, బహిరంగ సభ ▸▸జనవరి 20న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి పాడేరు : గిరిజనులకు నష్టాన్ని చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం చేపట్టిన చలో ఎర్రవరం విజయవంతమైంది. గిరిజనులు భారీగా తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభ జయప్రదమైంది.

బహిరంగ సభలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి అప్పలనర్స మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతి రద్దు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి పోరాటాన్ని నిర్వహిస్తామన్నారు. గిరిజన జాతీయ కమిషన్ చట్టంలో పేర్కొన్న వాటిని కూడా ఉల్లంఘించిన గిరిజన ద్రోహిగా మోడీ, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాలు మిగులుతాయన్నారు. చలో ఎర్రవరం సభను భగ్నం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయన్నారు. బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించే చర్యను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కాఫీ రైతులకు గిట్టు చెల్లించలేదని, సుమారు 60 కోట్ల బకాయి కూలి సొమ్ము ఇవ్వలేదన్నారు. కాఫీ ప్రాజెక్ట్ నగదును నవరత్నాలకు దారి మళ్ళించారని విమర్శించారు. గిరిజన సహజ సంపదను దోపిడీ చేసే పాలకవర్గానికి వ్యతిరేకంగా జనవరి 20 తేదీన నిర్వహించే చలో కలెక్టరేట్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో 15 వేల ఎకరాల అటవీ భూమిని ఆదాని కంపెనీకి అప్పగించే అధికారం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి లేదన్నారు. గిరిజన ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చట్ట వ్యతిరేకమని, ఈ విషయాన్ని గుర్తించి గిరిజనుల పోరాటానికి అరకు, పాడేరు ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులు మద్దతు ఇవ్వాలన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స



సభకు భారీగా తరలి వచ్చిన గిరిజనులు

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ కన్వీనర్ బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ అనంతగిరి మండలం లో 5800 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడుతో పాటు చింతపల్లి మండలంలో ఎర్రవరంలో కూడా హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయడమంటే గిరిజనులు జల సమాధి చేయడమే అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించలేని ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధితులను ఆదుకుంటామని, ఉపాధి కల్పిస్తామని మాయ మాటలు చెప్పడం దారుణమని తెలిపారు. పెదకొటలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి దొడ్డిదారిన సర్వే నిర్వహించారన్నారు. గుజ్జిలి, చిట్టెంపాడులో శాటిలైట్ సర్వే నిర్వహించారన్నారు. సర్వే కొచ్చే వారిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లక్కు మాట్లాడుతూ గిరిజన హక్కులు చట్టాలు ఉల్లంఘించిన నరేంద్ర మోడి, జగన్మోహన్‌రెడ్డిలు ఆధాని కార్పొరేట్ సంస్థలకు గిరిజనుల భూములు కట్టబెటడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు

గొందిపాకల సర్పంచ్ సాగిన వరలక్ష్మీ మాట్లాడుతూ, హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సాగించే గిరిజనుల పోరాటానికి మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొందిపాకల పంచాయతీ వైసీపీ ఎంపీటీసీ, చింతపల్లి సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, గిరిజన సంఘం మండల కార్యదర్శి చిరంజీవి, కొయ్యూరు మండల కార్యదర్శి ఎస్.సూరిబాబు, జీకే వీధి మండల కార్యదర్శి, దారకొండ ఎంపీటీసీ ఏ.బుజ్జిబాబు సత్యనారాయణ నాయుడు, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ నాయకులు గుడెపు చిన్నారాజు, గోపాలకృష్ణ, రాజు, కృష్ణంరాజు, మంగరాజు, బాలన్న, పెద్దఎత్తున గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



టేకు చెట్లకు కొలతలు వేస్తున్న శ్రీకాంతనాథ్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు

వన్య ప్రాణుల సంరక్షణకు కృషి

- విశాఖ అటవీ శాఖ కన్జర్వేటర్ శ్రీకాంతనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-సీలేరు

వన్యప్రాణులు అంతరించిపోకుండా వాటిని సంరక్షించడానికి పగడ్బందీగా రక్షణ చర్యలు చేపడుతున్నామని విశాఖపట్నం అటవీశాఖ కన్జర్వేటర్ శ్రీకాంతనాథ్‌రెడ్డి వెల్లడించారు. ఇటీవల విశాఖ అటవీ శాఖ కన్జర్వేటర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంతనాథ్‌రెడ్డి శుక్రవారం సీలేరు రేంజ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీలేరు అటవీ రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారెస్ట్‌లో వన్యప్రాణులు సంరక్షణ ఏ విధంగా ఉంది? పులులు సంచారం ఉందా? ఉంటే కెమెరాలతో వాటిని ఎలా గుర్తించాలి అనే కోణంలో రక్షణ చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఒడిస్సా నుంచి ఇటీవల రెండు పులులు అల్లూరి సీతారామరాజు జిల్లా ఫారెస్ట్ పరిధిలోకి వచ్చాయని, అందులో ఆడ, మగ ఉన్నాయని తెలిపారు. అవి ఫారెస్ట్ చివరి గ్రామాల్లో సంచరిస్తూ కాకినాడ, రాజమండ్రి సర్కిల్ వైపు వెళ్లి మళ్లీ వస్తున్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందని పేర్కొన్నారు. వాటిని టైగర్ ట్రాకింగ్ టీములుగా ఏర్పాటు చేసి గుర్తించగా పాడేరు రభ అనే బీట్ ఏరియాలో సంచరిస్తున్నట్లు నివేదిక వచ్చిందని వెల్లడించారు. విజయనగరం జిల్లా అటవీ ప్రాంతంలో పులులు సంచరిస్తున్నాయని ఎప్పటికప్పుడు తమ సిబ్బంది ఆనవాళ్లు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అల్లూరి జిల్లా ఏర్పడిన తర్వాత చింతపల్లి అటవీ డివిజన్‌కు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఈ డివిజన్‌లో సిబ్బంది, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. బోడ కొండమ్మ గుడి పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి అటవీ శాఖ ముందుకొచ్చిందని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని డిఎఫ్‌ఓను ఆదేశించినట్లు తెలిపారు. సరుగుడు వాటర్ ఫాల్స్ ఏరియా మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉండగా చుట్టుపక్కల ఉన్న భూమి రెవెన్యూ పరిధిలో ఉన్నట్లు గుర్తించమని చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరిస్తామని ముందుకొచ్చారని పేర్కొన్నారు.

సీలేరు రేంజ్‌లో విస్తృత పర్యటన

సీలేరులో అటవీ రేంజ్ పరిధిలో శ్రీకాంతనాథ్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. సీలేరు సమీపంలోని వలసిగడ్డ టేక్ ప్లాంటేషన్ సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అటవీ రేంజ్ కార్యాలయం చుట్టుపక్కన ఉన్న టేకు మారజాతి మొక్కలు పరిశీలించారు. దారకొండ పంచాయతీ డబ్బకోట సమీపంలో ఉన్న మారజాతి ప్లాంటేషన్ తనిఖీ చేశారు. దారాలమ్మ అమ్మవారి ఆలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆలయ తాత్కాలిక కమిటీ, ఆలయ పూజారితో సమావేశమే పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో డీఎఫ్ఓ సిహెచ్ సూర్యనారాయణ, సీలేరు రేంజ్ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ అధికారి సింహాచలం, దారకొండ సెక్షన్ ఆఫీసర్ కే సతీష్, వివేకానందరావు, చిట్టిబాబు, టెక్నికల్ అసిస్టెంట్ సత్తిబాబు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట:

మండలంలోని మఠం పంచాయతీ డురువీధీ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మఠం కేశవరావు నాయుడు మాట్లాడుతూ, జగనన్న విద్యా కానుకలో భాగంగా 8వ తరగతి చదువుచున్న విద్యార్థులకు టాబ్‌లను అందజేశామన్నారు. ట్యాబులతో విద్యార్థులు చదువు పై పూర్తి పట్టు సాధించాలని అయన అన్నారు. ట్యాబులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లను ఇస్తున్న హెచ్‌ఎం



దీక్షలో కూర్చున్న ప్రజా సంఘాల నేతలు

గిరిజన విద్యార్థుల మరణాలపై ..

సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన విద్యార్థుల మరణాలపై అధికారులు తక్షణమే గిరిజన ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, మరణాలకు డబ్బుతో వెలగట్టే సాంప్రదాయం మానుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, ఐక్య వేదిక కో కన్వీనర్ ప్రభుదాస్ డిమాండ్ చేశారు. ఐటీడీఏ వద్ద ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 12వ రోజు కొనసాగాయి. ఈ రిలే దీక్షలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, రెండు నెలల వ్యవధిలో ఆరుగురు విద్యార్థులు మరణించారని, గిరిజన విద్యార్థుల ప్రాణాలు గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. వరుసగా ఆరుగురు మంది విద్యార్థులు చనిపోయినా అధికారులకు, ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని, మరణించిన ఆ కుటుంబాలకు డబ్బులతో వెలగట్టే కొత్త సాంప్రదాయాన్ని ఐటీడీఏ అధికారులు తీసుకొచ్చారన్నారు.గిరిజన విద్యార్థుల ప్రాణాలు అంటే చులకన భావంతో అధికారులు వ్యవహరిస్తున్నారని, మరణాల నివారణకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని, డిమాండ్ చేశారు. పాడేరు ఐటీడీఏ పిఓను తక్షణమే సరెండర్ చేయాలని, పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలని, గిరిజన విద్యాసంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశార. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక కో కన్వీనర్లు మువ్వాళ లక్ష్మణరావు, చిన్నారావు, కాదేలి చంటిబాబు, బత్తిరి నరేష్, పి.లోకేష్, తిరుపతిరావు గిరిజన సంఘం నాయకులు బొజ్జన్న పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు: చింతపల్లి యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.1.55 కోట్ల బ్యాంకు లింకేజ్ చెక్కును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో చెక్కును అందించిన కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకు లింకేజ్‌ను 38 స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ, లీడ్ జిల్లా మేనేజర్ రవితేజ, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, లబ్దిదారులు పాల్గొన్నారు..



చెక్కును ఇస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గుండాల ఇసుక ర్యాంపు

1/70, పీసా చట్టాలకు విరుద్ధం

- తక్షణమే నిలిపివేయాలి
- సిపిఎం, టిడిపి, జనసేన ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి -ఎటపాక

మండలంలోని గుండాల ఇసుక ర్యాంపు 1/70, పీసా చట్టాలకు విరుద్ధంగా నడుస్తుందని, దానిని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ సీపీఎం, టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఇసుక ర్యాంపు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్ వేబిల్స్‌తో అక్రమంగా తెలంగాణ రాష్ట్రానికి ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. గిరిజన చట్టాలను కాలరాస్తూ, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తూ ఇష్టానుసారంగా నదిగర్భంలో ఎక్కువ లోతు తవ్వుతున్నారని విమర్శించారు. గిరిజన సొసైటీ ఏర్పాటు చేయాలన్న పీసా చట్ట నిబంధనలను ఉల్లంఘించారన్నారు. మ్యాన్ పవర్‌తో లోడింగ్ చేయాల్సి ఉండగా జెసిబిలతో లోడింగ్ చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలించకూడదని నిబంధనలు ఉన్నాయని, దీంతో చత్తీస్‌ఘడ్ వేబిల్స్‌తో తెలంగాణ రాష్ట్రానికి ఇసుక డంప్ చేస్తున్నారని తెలిపారు. నెల రోజులుగా ఈ ఇసుక ర్యాంపు నడుస్తున్నా అధికారులు కళ్ళకు గంతలు కట్టుకొని చోద్యం చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే చింతూరు ఐటిడిఏ పీవో, జిల్లా కలెక్టర్ స్పందించి ఇక్కడ జరుగుతున్న ఇసుక దందాను నిలువరించాలని, అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఐవి, మాధవరావు, తెలుగుదేశం నాయకులు పుట్ట రమేష్, వల్లభనేని చందు, మాచినేని రాజేష్, జనసేన నాయకులు మారసు గంగాధర్, ఎంపీటీసీ పాయం దేవి, గుండాల గ్రామస్తులు పాల్గొన్నారు.



గుండాల ఇసుక ర్యాంపు వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం, టిడిపి, జనసేన శ్రేణులు

పోరాట వీరుడు కొమరం లక్ష్మీనారాయణ

12వ వర్థంతి సభలో సిపిఎం నాయకులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కూనవరం

జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కొమరం లక్ష్మీనారాయణ అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అన్నారు. లక్ష్మీనారాయణ 12వ వర్థంతి కార్యక్రమంలో మండలంలో అభిచర్ల గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. లక్ష్మీనారాయణ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు శ్యామల కృష్ణ పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య అధ్యక్షతన జరిగిన సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ కామ్రేడ్ లక్ష్మీనారాయణ మన మధ్య లేక పోయినా, ఫారెస్ట్ అధికారులు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. నేటి ప్రభుత్వాలు గిరిజన చట్టాల సవరణకు పూనుకుంటున్నాయని, దానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు లక్ష్మీనారాయణ లాంటి పోరాట పటిమ కలిగి ఉండి అటవీ హక్కుల చట్టాల రక్షణకు పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య, నాయకులు పాయం జ్యోతి, వెంకటేశ్వర్లు, మడకం నాగమణి, బాబురావు, మాజీ సర్పంచ్ రవ్వ ప్రసాద్, లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణ స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

రామవరం నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలి

- ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న మండలంలోని రామవరం 104 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ఇళ్ల సర్వే నిర్వహించి పిఎన్ నోటిఫికేషన్‌లో చేర్చి బాధిత నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం నాయకులు శుక్రవారం ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రవీణ్ ఆదిత్యకు తహశీల్దారు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ముంపునకు గురైన అన్ని కుటుంబాల వారికి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా పునరావాసం, ప్యాకేజీ చెల్లించే విధంగా చూడాలని కోరారు. దీనికి స్పందించిన ప్రవీణ్ ఆదిత్య మాట్లడుతూ ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్ళి అందిరకీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పీటీసీ రంగారెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, సర్పంచ్ పులి సంతోష్ కుమార్ ఎంపీటీసీ ప్రదీప్ కుమార్, సున్నం చంద్రరావు, రామవరం గ్రామ నిర్వాసితులు పాల్గొన్నారు.



ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న సిపిఎం నాయకులు

యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్ ముద్రించిన 2023 క్యాలెండర్, డైరీలను జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు నమూనా ప్రశ్నాపత్రం, టెస్ట్ పేపర్లు తయారు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చిన్నబ్బాయి, కోశాధికారి జోగా రాజేష్, అనకాపల్లి మండల ప్రధాన కార్యదర్శి దేముడు నాయుడు, అచ్యుతాపురం అధ్యక్షులు రవి, సీనియర్ నాయకులు జీకేఆర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అనకాపల్లి డిఇఒ లింగేశ్వరరెడ్డి

సమస్యలపై స్పందించకుంటే చర్యలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: స్పందనలో అందిన సమస్యలపై స్పందించని అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన ఫిర్యాదులు అందిన వెంటనే విచారణాధికారిని నియమించి విచారణ నిర్వహించాలన్నారు. వినతులపై సకాలంలో విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను ఫోటోలు తీసి వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సహేతుకమైన కారణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తును తిరస్కరించరాదని, ఇందుకు గల కారణాన్ని తెలియజేస్తూ దరఖాస్తు దారుకి ఎండార్స్మెంట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొంతమంది అధికారులు స్పందనలో అందిన దరఖాస్తులు చూడటం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి అధికారి తప్పనిసరిగా దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలలో ఫిర్యాదులు పరిష్కరిస్తామన్న నమ్మకం కలగ జేయాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కూడా స్పందన ఫిర్యాదులపై చర్యలు అడుగుతున్నందున ప్రతి ఒక్కరు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఐటిడిఏ, గిరిజన సంక్షేమం, తాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్య, విద్యుత్, రెవెన్యూ శాఖలు ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జక నుండి అధికారులు, సిబ్బంది 'ఫేషియల్ రికగ్నిషన్ యాప్' ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. జనవరి నెల నుండి ప్రతి అధికారి రెండు రోజులు రంపచోడవరం, ఒక రోజు చింతూరు డివిజన్లలో పర్యటించాలన్నారు.

ఈ స్పందనలో భూమి తగాదాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, రహదారులు, డ్రైనేజీలు, రేషన్ కార్డులు, పింఛన్లు, తాగు నీటి సంబంధించిన 46 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'మేలుకొలుపు' పుస్తకం ఆవిష్కరణ

పాడేరు:పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై "మేలుకొలుపు" డిసెంబర్ నెల పత్రికను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ శివ శ్రీనివాస్, పిఓ గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినియోగదారులు హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, జిల్లా పౌర సరఫరాల అధికారి శివ ప్రసాద్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గణేష్ కుమార్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి -అనందపురం: నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, భీమిలి బ్లాక్ ఆధ్వర్యంలో పాదురుపాలెంలో జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ యువ వాలంటీర్ లొడగల అప్పలనాయుడు, టి. శంకర్ సారధ్యంలో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, లాంగ్‌జంప్ తదితర పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో బోయిపాలెం విజేతగా నిలవగా, పాదురుపాలెం జట్టు రన్నరప్‌గా నిలిచింది. కబడ్డీ పోటీల్లో వంరద 'ఎ,బి' జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. లాంగ్ జంప్‌లో బంటుబిల్లి జగదీశ్ ప్రథమ, వరహా సంతోష్ ద్వితీయ, పోసు వంశీ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి గొర్లె ఉమామహేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చక్రవర్తి, లీలాప్రసాద్, తారకేష్, బంగారాజు, వంశీ, ప్రభు, జగదీష్, అనూప్, నాగరాజు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా...

ముగిసిన గిరి విజ్ఞాన సంబరాలు
ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



మాట్లాడుతున్న అరకు ఎంపీ మాధవి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి జిటిడబ్ల్యూ బాలుర పాఠశాల ఆవరణలో ఐటిడిఎ స్థాయిలో ఈనెల 28న ప్రారంభమైన గిరి విజ్ఞాన సంబరాలు-2022 శుక్రవారం ముగిసాయి. టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూఒలు ఎల్.రజిని, మల్లిఖార్జున పర్యవేక్షణలో తలారిసింగి పాఠశాల హెచ్ఎం రీమలి జాన్‌తో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పిడిలు ఈ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లు చేశారు. అరకు ఎంపి జి.మాధవి, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, జిసిసి ఛైర్మన్ ఎస్.స్వాతిరాణి, రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ ఎస్.బుల్లిబాబు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలకృష్ణ, జెసి శివ శ్రీనివాసు, డిఆర్ఒ బి.దయానిధి, డిఇఒ పి.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల హెచ్ఎం రీమలి జాన్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో జిల్లా కలెక్టర్, ముఖ్య అతిథులు ప్రసంగించారు. అద్భుతమైన ఆలోచనలతో ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు తయారు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

అనంతరం ఐటిడిఎ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గిరి విజ్ఞాన, క్రీడా ప్రదర్శనలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందించారు. విద్యార్థుల ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు, దింసా, నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు, హెచ్ఎంలు బావరాజు అప్పారావు, పూర్ణచందరావు, పలాసి కృష్ణారావు, ఆర్.సూర్యనారాయణ, కె.రామారావు, బాలరాజు, నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

577 ప్రాజెక్టులు ప్రదర్శన...

ఏజెన్సీ 11 మండలాల పరిధిలోని 122 జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలతో సంబరాల ప్రాంగణం సందడి నెలకొంది. పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో 1100 మంది గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ఐటిడిఎ స్థాయి గిరి విజ్ఞాన సంబరాల్లో 577 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వివిధ అంశాలపై రూపొందించిన ఈ ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. సబ్జెక్టుల వారీగా తెలుగులో 93, ఇంగ్లీష్ లో 94, గణిత శాస్త్రంలో 107, భౌతిక శాస్త్రంలో 97, జీవశాస్త్రంలో 94 ప్రాజెక్టులను రూపొందించారు. సంబరాల మూడు రోజులు సాయంత్రం 6 గంటల నుంచి విద్యార్థులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు మేళవింపుగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ, అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వసతి, చక్కని భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.



అబ్బురపరిచేలా గిరిజనుల ప్రదర్శన

పొడిబారిన కళ్లకు సకాలంలో చికిత్స అవసరం



డాక్టర్ శిల్పాతరణి

ప్రజాశక్తి - ఆరిలోవ : పొడి కన్ను వ్యాధి కేవలం రోగి చూపును ప్రభావితం చేయడమే కాకుండా, వారి జీవన నాణ్యతను, పనికి ఆటంకం కలిగిస్తుందని ప్రముఖ ఆప్తమాలజిస్టు డాక్టర్ శిల్పాతరణి అన్నారు. చలికాలంలో కళ్లపొడిబారడం సాధారణమని, మొబైల్, కంప్యూటర్ స్క్రీన్లను సుదీర్ఘకాలం చూడడం, తీవ్రమైన కంటికి దగ్గరి పని కార్యకలాపాలు, కీళ్లనొప్పులకు కారణమయ్యే శారీరక రోగాలు, కొన్ని వ్యాధులకు వాడిన ఔషధాల కారణంగా ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. సకాలంలో గుర్తించి చికిత్స అందించడం అత్యవసరమన్నారు. నగరంలోని ఎల్‌వి. ప్రసాద్ వైద్యవిజ్ఞాన సంస్థ, జిఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణంలో పొడి కళ్ల వ్యాధి చికిత్సకు విస్తృత శ్రేణి అత్యాధునిక రోగ నిర్ధారణ పరీక్షలు, వైద్యం, శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాటం



మాట్లాడుతున్న జెఎసి కన్వీనర్ రామారావు దొర

ప్రజాశక్తి-పాడేరుటౌన్: పార్టీలు, కులాలకతీతంగా గిరిజనులందరూ ఏకమై గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షణకై పోరాడాలని జెఎసి కన్వీనర్ రామారావుదొర పిలుపునిచ్చారు. గిరిజనుల భూమి, సంపద, రిజర్వేషన్ జోలికి రావద్దని ప్రభుత్వాలకు హెచ్చరించారు. గిరిజనుల ప్రయోజనాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆదివాసి జెఎసి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఆదివాసి గర్జన పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ముఖి శేషాద్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చకూడదని, జిఒ-3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ ఎస్‌టిలపై చర్యలు చేపట్టాలని, గిరిజనుల హక్కులు, చట్టాలు పరిరక్షణకై పాలకులు చిత్తశుద్ధితో పోరాడాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలను వివిధ రూపాల్లో తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన జెఎసి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు చేయూత

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలంగాణలో సివిల్స్, ఇతర పోటీపరీక్షలకు సన్నద్ధమౌతున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి నిరుద్యోగులకు అక్కడి టిఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని ఆ రాష్ట్ర సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.శుక్రవారం. విశాఖ వచ్చిన సందర్భంగా అంబేద్కర్ భవన్‌ను సందర్శించారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీకి రూ.లక్ష విరాళం అందజేశారు.ఈ సందర్భంగా అంబేద్కర్ భవన్ బొడ్డు కల్యాణరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణలో సివిల్ సర్వీస్ అభ్యర్థులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు, పోటీపరీక్షలకు సన్నద్ధమౌతున్న వారికి ఫీజులు అందజేస్తున్నామన్నారు. తెలంగాణలో దళితులకు భూములు, అంబేద్కర్ భవనాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు కార్యదర్శి జెవి ప్రభాకర్, కోశాధికారి సత్యనారాయణ. రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు బైపా అరుణకుమార్, ప్రముఖ న్యాయవాది ఐఎం అహ్మద్ , సొసైటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ అర్జున పాల్గొన్నారు

బంగారు, వెండి ఆభరణాల బహూకరణ

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖ నగరానికి చెందిన వ్యాపారవేత్త శేషు మస్తాన్‌రావు శుక్రవారం రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.20 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను వితరణగా అందజేశారు.ఇందులో అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు, స్వామికి 25 కిలోల వెండితో చేయించిన పాదాలు, కిరీటం, శంఖుచక్రాలు ఉన్నాయి. ఈ ఆభరణాలకు వేద పండితులు ముందుగా పూజలు నిర్వహించి, అనంతరం శ్రీవారికి అలంకరించారు. ఆలయ ఎఇఒ రమేష్, సూపరింటెండెంట్ రాజు ఉన్నారు.

విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బోధన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ మద్దిలపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్థానిక యువకుడు మద్దిల గురునాథ్ కొంతకాలంగా ఉచితంగానే స్పోకెన్ ఇంగ్లీష్ బోధిస్తున్నట్లు హెచ్ఎం రమేష్ తెలిపారు. సేవా దక్పథంతో స్పోకెన్ ఇంగ్లీష్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న గురునాథ్‌ను ఉప సర్పంచ్ మద్దిల వెంకటరమణ, హెచ్ఎం రమేష్, ఎస్ఎంసి చైర్మన్ దేవి, ఉపాధ్యాయులు శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. చదువుకున్న యువకులు ఇలా విద్యాబోధనకు ముందుకు రావాలని పలువురు కోరుతున్నారు.



అనకాపల్లిలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

సిఐటియు కార్మిక చైతన్య యాత్రకు అపూర్వ స్వాగతం

ప్రజాశక్తి - విలేకరుల బృందం


భీమవరంలో తలపెట్టిన సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన కార్మిక చైతన్య యాత్ర విశాఖ జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలోకి శుక్రవారం ప్రవేశించింది. ఈ యాత్రకు ఎక్కడికక్కడ ప్రజలు, కార్మికులు ఘన స్వాగతం పలికారు. లంకెలపాలెం, అనకాపల్లి, అచ్యుతాపురం ప్రాంతాల్లో సభలు జరిగాయి. యాత్రకు స్వాగతం పలుకుతూ మడుతూరు జంక్షన్ నుంచి అచ్యుతాపురం వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ఆయా చోట్ల సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు.

అనకాపల్లి : కార్మికులు పోరాటాల ద్వారానే బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాల్లో ముఠా కార్మిక చట్టాలను సాధించారని, అసంఘటిత రంగ కార్మికులు ఐక్యంగా ఉద్యమిస్తే సాధించలేనిది ఏమీ లేదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో శుక్రవారం కార్మిక చైతన్య యాత్ర అనకాపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా బాటా సెంటర్ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా మందస నుంచి భీమవరం వరకు ఈ జాతా సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం లేదా అమ్మేయడానికి పూనుకోవడాన్ని తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో గంగవరం, కృష్ణపట్నం పోర్టులను అదానీకి అప్పగించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్ర రాష్ట్రాన్ని అదానీ రాష్ట్రంగా మారుస్తున్నాయని దుయ్యబట్టారు. రోజూ దేశభక్తి జపం చేసే బిజెపి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియా దేశానికి చెందిన పోస్కో కంపెనీకి కట్టబెట్టే కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన రెండేళ్లుగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతాయన్నారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం తేవాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ బోనస్, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు అరికట్టాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్లపై జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బేబీ రాణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, మండల కార్యదర్శి పరమేశ్వరరావు, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ముఠా కార్మిక సంఘం నాయకులు భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్య బాబు, డి.శ్రీనివాసరావు, బి.నూకఅప్పారావు, లంక అప్పారావు, బొందల అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, ప్రజానాట్య మండలి బృందగీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

పరవాడ: మండలంలోని లంకెలపాలెం జంక్షన్‌లో కార్మిక చైతన్య యాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఫార్మా సిటీలో కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం, ప్రభుత్వ శాఖల అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని మండిపడ్డారు భద్రత ఆడిట్‌ను ఫార్మా పరిశ్రమల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత కాలుష్యానికి కారణమైన రాంకీపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బేబీ రాణి పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి

త్వరలో ఏలేరు-తాండవ కెనాల్ లింక్ ప్రాజెక్టు పనులు
అభివృద్ధి పనుల ప్రారంభంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి
బలిఘట్టం వద్ద ముఖ్యమంత్రికి ఘనస్వాగతం
పరిశ్రమ ఏర్పాటు చేయండి: ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ విజ్ఞప్తి



తాండవ-ఏలేరు కాలువ లింక్ ప్రాజెక్ట్ శంకుస్థాపనలో సిఎం జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నం ప్రాంతం రూపురేఖలు మరికొద్దిరోజుల్లో మారబోతున్నాయని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడివుందన్నారు. వైద్య సేవలు అందుబాటులోలేని ఈ ప్రాంతంలో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నర్సీపట్నం మండలం జోగినాథునిపాలెం వద్ద మెడికల్ కాలేజీ, ఏలేరు-తాండవ కెనాల్ లింక్ ప్రాజెక్టు పనులు, నర్సీపట్నం రోడ్డు విస్తరణ పనులకు సిఎం శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనాల్ ప్రాజెక్టు పనులు పూర్తయితే అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. రూ. రూ.986 కోట్ల విలువైన పనులు పూర్తయితే ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయన్నారు. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ అన్‌రాక్ కంపెనీలో నిర్వాసితులకు రెండు సెంట్లు స్థలం ఇప్పించాలని సిఎంను కోరారు. గొలుగొండ మండలం దేవీపట్నం రోడ్డు పనులకు అటవీ అనుమతులు వచ్చేలా చూడాలన్నారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి కోసం పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు.

సిఎంకు ఘనస్వాగతం

నర్సీపట్నం పర్యటనకు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వైసిపి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బలిఘట్టం వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్ద సిఎంకు మంత్రులు బూడి ముత్యాలనాయుడు, రాజన్నదొర, అమర్‌నాథ్, రజని, దాడిశెట్టి రాజా, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర, అనకాపల్లి, అరకు ఎంపీలు డాక్టర్ బివి.సత్యవతి, మాధవి, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్‌పి గౌతమిశాలి, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, వంశీకృష్ణయాదవ్, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గొల్ల బాబూరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కన్నబాబురాజు, అదీప్‌రాజ్, భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ, నర్సీపట్నం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, చింతకాయల అనిత, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, పి.బాలరాజు, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, ఆర్‌డిఒ భవానీశంకర్, తదితరులు స్వాగతం పలికారు.

రోడ్ షో

బలిఘట్టం హెలిప్యాడ్ నుంచి జోగినాధునిపాలెం సభా ప్రాంగణం వరకు సిఎం జగన్మోహన్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. రోడ్డు పొడవునా వున్న ప్రజలకు ఆయన అభివాదం చేసుకుంటూ సభ వద్దకు చేరుకున్నారు.

తీవ్ర పోలీసు నిర్బంధం

సిఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు ఎక్కడికక్కడ ప్రతిపక్ష పార్టీల నాయకులను, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేశారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.అప్పలరాజును, అడ్డరోడ్డులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణను గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. నర్సీపట్నం, బుచ్చయ్యపేట, మాడుగుల, గొలుగొండ మండలాల్లో టిడిపి, జనసేన, సిఐటియులకు చెందిన పలువురు నాయకులను హౌస్ అరెస్టులు చేశారు.

అక్రమ అరెస్టులను ఖండించండి
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లాలోని జోగినాథునిపాలెంలో మెడికల్ కాలేజీ శంకుస్థాపనకు వస్తున్న సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, ఎస్.రాయవరం మండల నాయకులు ఎం.సత్తిబాబులను అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు అత్యుత్సాహంతో సిపిఎం నాయకులను నిర్బంధించి అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం తగదన్నారు. సిఎం ఏ జిల్లా పర్యటనకు వెళ్ళినా ముందుగా సిపిఎం నాయకులను అరెస్టు చేయడం పరిపాటిగా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం నాయకులంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు.

బిసిల సంక్షేమాన్ని విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం బిసిలను కేవలం ఓటర్లుగానే చూస్తోందని, వారి అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు అన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో బిజెపి విశాఖ జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. ముందుగా ప్రధాని మోడీ మాతృమూర్తి మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే విజయవాడ, విశాఖ నగరాలలో తమ పార్టీ ఆధ్వర్యంలో బిసి సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులకు అనేక హామీలు ఇచ్చిన జగన్ మోహన్ రెడ్డి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. బిజెపి విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు రాష్ట్రంలోని 13 వేల గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహించాలని నిర్ణయించామని, ఇప్పటికే పలు గ్రామాల్లో పాదయాత్రలు జరుగుతున్నాయని అన్నారు. రానున్న కాలంలో బిజెపి, జనసేన కలిసి పని చేస్తాయని తెలిపారు.



మాట్లాడుతున్న మల్లికార్జున

ప్రగతి పథంలో విఎంఆర్‌డిఎ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గడిచిన సంవత్సర కాలంలో విఎంఆర్‌డిఎ ప్రగతి పథంలో పయనించిందని సంస్థ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. విఎంఆర్‌డిఎ పరిధిలో జరిగిన కార్యక్రమాలపై ఆయన శుక్రవారం వార్షిక సమావేశం ఏర్పాటు చేసి మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జగనన్న కాలనీల పేరుతో 5000 ఎకరాల్లో 81 లే అవుట్లు వేశామని, ప్రాథమిక సౌకర్యాల కల్పనకు ఇప్పటి వరకూ రూ.150 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఈ లే అవుట్ల ద్వారా 1,35,000 మందికి లబ్ధి చేకూరనుందన్నారు. ఎమ్ఐజి స్మార్ట్ టౌన్‌షిప్ విషయానికి వస్తే ఇప్పటివరకు 13 లే అవుట్లలో అభివృద్ధికి ఏర్పాట్లు జరిగాయని, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నంలకు చెందిన లే అవుట్లలో ఇప్పటికే పనులు ప్రారంభించామని తెలిపారు. 450 ఎకరాల భూమిని తీసుకొని తద్వారా 3370 ప్లాట్లు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. వాణిజ్య అవసరాల నిమిత్తం 11 అంతస్తుల ఎత్తులో సిరిపురంలో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సెంటర్ నిర్మిస్తున్నామని తెలిపారు. రూ.10 కోట్ల వ్యయంతో బీచ్ రోడ్‌లో నిర్మిస్తున్న సీ హరియర్ ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం పూర్తయిందని, వచ్చే నెలలో దాని ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడించారు. కన్వెన్షన్ సెంటర్ల విషయానికొస్తే విఎంఆర్‌డిఎ పరిధిలో పెందుర్తి మండలం చీమలాపల్లిలో ఒక ప్రాజెక్టు, ఎండాడ దిశా పోలీస్ స్టేషన్ వద్ద మరో ప్రాజెక్టు నిర్మిస్తున్నామని తెలిపారు. రామ్‌నగర్‌లో 13.5 కోట్ల వ్యయంతో ఒక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించామన్నారు. లే అవుట్లకు, భవనాలకు ఇచ్చిన అనుమతులను, వచ్చిన ఆదాయాన్ని వివరించారు. ఫారెస్ట్ వింగ్ విషయానికి వస్తే పచ్చదనం, పర్యావరణంపై మాస్టర్ ప్లాన్ మ్యాప్‌లు తయారు చేశామని అన్నారు. ఏ సంస్థలోనూ లేని విధంగా 96 మంది ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు వలె సిపిఎస్ ద్వారా 4.96 కోట్లు గ్రాట్యుటీని అందించామని అన్నారు. కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి చిరునామా ఎపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలో గత ప్రభుత్వాలేవీ పట్టించుకోని పారిశ్రామిక రంగానికి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఊతమిచ్చిందని, తద్వారా పారిశ్రామిక ప్రగతికి ఎపి చిరునామాగా మారిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడచిన మూడేళ్లలో రాష్ట్రంలో రూ.73 వేల కోట్ల పెట్టుబడులతో 21 భారీ, అతి భారీ పరిశ్రమలు తీసుకువచ్చామని, తద్వారా 60 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. నాలుగు వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్యానల్స్ పరిశ్రమకు వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి ఇస్తున్న ప్రోత్సాహకాలను చూసి అనేకమంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారని, భారీ పరిశ్రమలు, ఐటి, హ్యాండ్లూమ్స్, గ్రీన్ ఎనర్జీ రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఆదిత్య బిర్లా, లక్ష్మీ మిట్టల్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 3, 4 తేదీలలో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టమెంట్ సదస్సుకు ప్రపంచ దేశాల నుంచి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించనున్నామని తెలిపారు. త్వరలో 11 వేల ఎకరాలలో రూ.8500 కోట్ల పెట్టుబడులతో కడప స్టీల్‌ప్లాంట్ మొదటి దశ నిర్మాణం ప్రారంభమవుతుందని వెల్లడించారు. కొప్పర్తి, తిరుపతి, నెల్లూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు. లాజిస్టిక్స్, టెక్స్‌టైల్స్ ఎగుమతులకు సంబంధించిన మరొక పాలసీని కూడా తీసుకురానున్నామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో టైలర్ మేడ్ పాలసీ కింద రూ.15 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను తీసుకువస్తున్నామని, తద్వారా 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు.